సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



గొంపలో గ్యాస్ లీక్

వంట గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ఇంట్లోని గృహోపకరణాలన్నీ కాలిపోయాయి.

IIలో



ఏయూ లైబ్రరీకి ఐఎస్‌వో గుర్తింపు

విశాఖ: ఏయూలోని డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయం ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్ సాధించింది.



ఘనంగా సహస్ర తులసి పూజ

విశాఖ: కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు కోటవురట్లలో 'జగనన్నకు చెబుదాం'

తుమ్మపాల: ఈ నెల 15న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కోటవురట్ల మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని, ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఆయా మండలాల్లో ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ




డిప్యూటీ సీఎంకు మట్టి విగ్రహాలను అందిస్తున్న భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు

మాడుగుల: ప్రతి ఒక్కరు మట్టి వినాయకుని పూజించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయనకు మాడుగుల భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు వినాయక మట్టి విగ్రహాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మాడుగుల పట్టణానికి చెందిన భారత నిర్మాణ సేవా ట్రస్ట్ గత పదేళ్లుగా ఏటా సుమారు రెండు వేల మట్టి విగ్రహాలను ఉచితంగా భక్తులకు అందిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గౌరీపట్టపు మహేష్ కుమార్, పేలూరి కృష్ణారావు, కొప్పాక రాంకీ, పెద్దపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి(డీసీహెచ్) శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక వైద్యాలయంలోని తన కార్యాలయంలో సాక్షితో ఆయన గురువారం మాట్లాడారు. మండల స్థాయిలో వైద్యశిబిరాల నిర్వహణ బాధ్యతల్ని ఎంపీడీవోలకు అప్పగించామన్నారు. ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులతోపాటు మరో స్పెషలిస్టు శిబిరానికి హాజరై రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న 10 మంది స్పెషలిస్టులను గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

విశాఖ కొత్త పోలీస్ కమిషనర్ బాధ్యతల స్వీకారం



నూతన కమిషనర్ రవిశంకర్ అయ్యనార్‌కు అభినందనలు తెలుపుతున్న పూర్వ సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ): అందరి సహకారంతో ప్రశాంత విశాఖే లక్ష్యంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని నగర నూతన పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ అన్నారు. ఆయన గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీపీగా విధులు నిర్వర్తించిన డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ నుంచి చార్జ్ తీసుకున్నారు. సీపీ రవిశంకర్ మాట్లాడారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. సిటీలో శాంతిభద్రతలు, మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తానని చెప్పారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి విశాఖకు చెందిన వ్యాపారవేత్త హనుమంతు లక్ష్మీనారాయణ రమణమ్మ దంపతులు రూ.1,16,100ల విరాళాన్ని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్‌లకు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి దేవస్థాన ప్రాంగణ వాయువ్య మూలలో ఉపారం సమర్పించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు కోసం ఈ విరాళాన్ని అందించినట్లుతెలిపారు. ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని భక్తుల సౌకర్యార్థం ఆలయం బయటనున్న వేపచెట్టు దగ్గర ఏర్పాటుచేశారు.

పొత్తులో సీటు ఫట్!

- తమ సీటుకు ఎసరు వస్తుందేమోనని జనసేన, టీడీపీ నేతల్లో ఆందోళన
- రాజకీయ భవిష్యత్‌పై ఆశావహుల అంతర్మథనం
- పెందుర్తిలో జనసేన నేత పంచకర్ల ఆశలకు పంక్చర్
- భీమిలి, ఉత్తర, పశ్చిమ, యలమంచిలి.. అన్నింట్లోనూ అదే పరిస్థితి
- నియోజకవర్గ స్థాయిలో పొత్తు పొడుపు కష్టమే...!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టుంది అటు జనసేన, ఇటు టీడీపీ నేతల పరిస్థితి. టీడీపీతో జతకడతామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో తమ సీట్లకు ఎక్కడ ఎసరు పడుతుందోనన్న ఆందోళన ఇరు పార్టీల నేతల్లోనూ వ్యక్తమవుతోంది. తొలి నుంచి పార్టీలో ఉండటంతో పాటు గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసిన అభ్యర్థులు.. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తుతో తమ సీటు గల్లంతవుతుందని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పొత్తులో ఏయే సీట్లను కేటాయిస్తారో... అందులో తమ సీటు ఎక్కడ ఉంటుందోనని టీడీపీ నేతల్లోనూ గుబులు మొదలైంది. ప్రధానంగా పెందుర్తి, భీమిలి, విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ, యలమంచిలి, చోడవరం, గాజువాక, పాయకరావుపేట వంటి నియోజకవర్గాల్లో అగమ్యగోచర పరిస్థితి నెలకొని ఉంది. తమకు సీటు కేటాయించని పక్షంలో తమ భవిష్యత్ ఏమిటో తేల్చుకుంటామనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అంతేకాకుండా సీటు ఆశించి తాజాగా జనసేనలో చేరిన అభ్యర్థుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఉన్న చోట ఉండకుండా... ఎప్పుడు ఎలా వ్యవహరిస్తారో తెలియని ఇటువంటి పార్టీలో ఎందుకు చేరామోనంటూ తలలు పట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా పొత్తు ప్రకటన తర్వాత కేడర్‌లో ఉత్సాహం రావాల్సిన పరిస్థితి నుంచి దిక్కుతోచని దుస్థితికి తీసుకొచ్చారనే అభిప్రాయం ఇరు పార్టీ నేతల్లోనూ వ్యక్తమవుతోంది.



నియోజకవర్గాల వారీగా..!

ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ-జనసేన పొత్తులతో సీట్లలో తకరారు ఏర్పడే పరిస్థితి నెలకొని ఉంది. పెందుర్తితో మొదలుకొని విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ, భీమిలి, గాజువాక, యలమంచిలి, చోడవరం, పాడేరు ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇరు పార్టీల నుంచి సీట్లు ఆశిస్తున్న అభ్యర్థుల మధ్య విభేదాలు తలెత్తే పరిస్థితులున్నాయి. పైగా పొత్తు కోసం జనసేన నుంచి ప్రకటన రావడంతో తమకు ఇచ్చే సీట్ల సంఖ్య కూడా తక్కువే ఉంటుందని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అయితే, టీడీపీ అవసరం కోసం అర్రులు చాస్తున్నందున.... తమ పార్టీకి సీట్లు తక్కువగా వస్తే తమ పరిస్థితి ఏమిటని టీడీపీ నేతలు సందిగ్ధంలో పడ్డారు. మొత్తంగా ఇరు పార్టీలకు చెందిన పరిస్థితిని నియోజకవర్గాల వారీగా గమనిస్తే..

- పెందుర్తి నియోజకవర్గం నుంచి ఇప్పటికే టీడీపీ నుంచి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ ఉన్నారు. అక్కడ సీటు ఆశించి జనసేనలో చేరిన పంచకర్ల రమేష్‌బాబు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెందుర్తి నుంచి పోటీ చేస్తానని కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన పంచకర్ల... ఇప్పుడు పైనుంచి వచ్చిన ఆదేశాలతో పొత్తును స్వాగతిస్తున్నట్టు ప్రకటించారు. అయినప్పటికీ పొత్తు కాస్తా తనకు ఎసరు పెట్టిందని అనుచరుల వద్ద వాపోతున్నట్టు తెలుస్తోంది.
- గాజువాక నుంచి తిరిగి కోన తాతారావు, తిప్పల రమణారెడ్డిలు జనసేన పార్టీ నుంచి సీటును ఆశిస్తున్నారు. ఇన్నాళ్లుగా ఉన్న తన పరిస్థితి ఏమిటని టీడీపీకి చెందిన పల్లా శ్రీనివాసరావు మండిపడుతున్నారు. నియోజకవర్గాన్ని వదులుకుంటే ఇక రాజకీయాల్లో పక్కకు తప్పుకోవాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని అనుచరుల వద్ద ప్రస్తావిస్తూ... గాజువాక సీటును వదులుకునేది లేదని చెబుతున్నట్టు సమాచారం. ఇదే జరిగితే జనసేన నేతలు టీడీపీకి సహకరించే పరిస్థితి ఉండదని తెలుస్తోంది.
- విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి గతంలో జనసేన నుంచి పోటీ చేసిన పసుపులేటి ఉషాకిరణ్... తనకు సీటు ఇవ్వకపోతే తన దారి తాను చూసుకునే పరిస్థితి ఉందని సమాచారం. ఇక్కడ టీడీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నారు.
- విశాఖ దక్షిణం నుంచి మూగి శ్రీనివాస్, బీశెట్టి వసంతలక్ష్మితో పాటు తాజాగా ఆ పార్టీలో చేరిన కార్పొరేటర్ కందుల నాగరాజు సీటు ఆశిస్తున్నారు. ఇప్పుడు పొత్తులో ఈ సీటు కాస్తా టీడీపీకి వెళితే తమ పరిస్థితి ఏమిటంటూ వాపోతున్నారు. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా గండి బాబ్జీ వ్యవహరిస్తున్నారు.
- గతంలో జనసేన నుంచి భీమిలిలో పోటీచేసిన పంచకర్ల సందీప్ సీటు తనకేనని ప్రకటించుకుంటున్నారు. ఇక్కడ ఏ పార్టీకి సీటు వచ్చినా.. ఇరు పార్టీల అభ్యర్థులు సహకరించుకునే పరిస్థితి లేదు.
- విశాఖ పశ్చిమలో జనసేన నుంచి పీలా రామకృష్ణ సీటు ఆశించి పార్టీలో పనిచేస్తున్నారు. ఇది టీడీపీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే సీటు కావడంతో జనసేనకు హ్యాండ్ ఇస్తారని తెలుస్తోంది.
- విశాఖ తూర్పులో జనసేన నుంచి బొలిశెట్టి సత్యనారాయణ సీటు ఆశిస్తున్నారు. టీవీ చర్చల్లో ఎంత వాదించినా... పొత్తులో తన సీటు గోవిందా అని భోరుమంటున్నారు.
- ఇక గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసిన పీవీఎస్ఎన్ రాజు (చోడవరం), అనకాపల్లి నుంచి పోటీ చేసిన పరుచూరి భాస్కరరావు పొత్తులో తమ సీటు ఏమవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.
- యలమంచిలిలో జనసేన నుంచి సుందరపు విజయ్‌కుమార్‌కు సీటు కేటాయిస్తే... టీడీపీ నుంచి సీటు ఆశిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు.
- పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన తరపున పనిచేస్తున్న శివదత్‌కు మొండిచేయి చూపించేలా ఉంది. అదేవిధంగా అరకు నియోజకవర్గం నుంచి సాయిబాబా, పాడేరు నుంచి గంగులయ్య, పద్మలు కూడా జనసేన కోటాలో తమకు సీటు రాకపోతే తమ దారి తమదే అనే రీతిలో ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇరు పార్టీ నేతల మధ్య సీట్ల కోసం పోటీ నెలకొంది. పైన ప్రకటించినంత సులభంగా నియోజకవర్గాల్లో పొత్తు నెలకొనే పరిస్థితి లేదని ఇరు పార్టీల నేతలే ప్రకటిస్తుండటం గమనార్హం.

నేడు విశాఖలో సీఎం జగన్ ట్రాన్సిట్ హాల్ట్



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం విశాఖ వస్తున్నారు. విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా గన్నవరంలో బయలుదేరి ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా ద్వారపూడి వెళతారు. విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొని.. తిరిగి మధ్యాహ్నం 2.05 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడి నుంచి గన్నవరం బయలుదేరుతారు.

అన్ని గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు



మామిడిపల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి

దేవరాపల్లి: అన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జగనన్న స్వచ్ఛ సంకల్ప ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి అన్నారు. దీనివల్ల పరిశుభ్రతతోపాటు పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. మండలంలోని మామిడిపల్లి, ములకలాపల్లి గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వాటి పనితీరుపై స్థానిక పంచాయతీ సెక్రటరీలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని తామరబ్బ, తారువ, బోయిలకింతాడ, ఎస్.జి.నగరం, కె.ఎం.పాలెం, గరిశింగిలను పరిశుభ్రత గ్రామాలుగా గతంలో ఎంపిక చేయగా.. తాజాగా మామిడిపల్లిని ప్రకటించారు. ఈ గ్రామంలో పారిశుధ్యం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై సర్పంచ్ కర్రి సూరినాయుడును అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ జి.సంతోషి నిళిని, పంచాయతీ సెక్రటరీలు సుధాకర్‌బాబు, జామి అప్పారావు తదితరులు ఉన్నారు.

సాగునీటి వ్యవస్థ పటిష్టతకు చర్యలు

- వ్యవసాయం, నీటి పారుదల, పరిశ్రమల్లో భద్రతపై సమీక్షలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



వ్యవసాయ, నీటిపారుదల సలహా మండళ్ల సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

తుమ్మపాల: జిల్లాలో సాగునీటి వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ, నీటిపారుదల సలహా మండళ్లు, పరిశ్రమల భద్రతా ప్రమాణాల సమీక్షను వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు ప్రాణాధారమైన నీటిని ఒడిసిపట్టే డ్యామ్‌లు, గ్రోయిన్‌లు, పొలాలకు నీరందించే కాలువలను పటిష్ట పరచాలన్నారు. అందుబాటులో ఉన్న నిధులే కాకుండా సామాజిక బాధ్యతా నిధులు, ఎంపీ, జెడ్పీ నిధులను సేకరించి పనులు చేపట్టేందుకు కృషి చేయాలన్నారు. రానున్న కాలంలో వర్షపాతం, రిజర్వాయర్లలో నీటి లభ్యత ఆధారంగా రైతులకు శాస్త్రవేత్తలు దిశానిర్దేశం చేయాలన్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో మండల స్థాయిలో రైతు సమావేశాలు ఏర్పాటుచేసి, పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ కలిగొట్ల మంగళాపురం గ్రోయిన్ పూర్తిగా పాడైనందున దాదాపు వెయ్యి ఎకరాల వరకు పంటల సాగు తగ్గిందన్నారు. వీటి మరమ్మతులకు ఎంపీ బీవీ సత్యవతి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చోడవరంలోని లక్ష్మీపురం, పీఎస్ పేట గ్రోయిన్లను కూడా తనిఖీ చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ వర్షపాతం తక్కువగా ఉన్న మండలాల్లో శాస్త్రవేత్తలు రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు మాట్లాడుతూ ఇప్పటివరకు 50 శాతం భూముల్లో సాగు జరిగిందని, ప్రస్తుత వర్షాలతో 80 శాతం వరకు సాగు పెరగవచ్చన్నారు. సమావేశంలో జిల్లా నీటి పారుదల అధికారి త్రినాథమ్మ, ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత అత్యంత ప్రధానం

పరిశ్రమల్లో అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని అధికారులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కొత్తగా ఏర్పాటుచేసే పరిశ్రమల్లో పూర్తి భద్రత ఉండేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ప్రమాదాలు జరిగినపుడు తక్షణం అనుసరించాల్సిన జాగ్రత్తలపై ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు. ఫస్ట్ ఎయిడ్‌పై కార్మికులకు శిక్షణ ఇవ్వాలన్నారు.

గత సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలను జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీధర్ వివరించారు. రైస్ మిల్లులతో పాటు అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్ర మాణాలపై చెక్ లిస్టు ప్రకారం తనిఖీ చేయాలన్నారు. ఏపీఐఐసీ జెడ్‌ఎం త్రినాథ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు, ఈసీబీ నాగిరెడ్డి, అగ్నిమాపక అధికారి రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమూల్యమైనది మత్స్య సంపద



పూడిమడకలో మత్స్య శాఖ ర్యాలీ



వివిధ రకాల సముద్రం చేపల పోస్టర్ ప్రదర్శనను తిలకిస్తున్న మత్స్యకారులు

- కాలుష్యం నుంచి కాపాడాలి
- సముద్ర తీరాన్ని పరిరక్షించాలి
- మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి బామిరెడ్డి

అచ్యుతాపురం (అనకాపల్లి): మత్స్య సంపదను పరిరక్షిస్తూ.. పర్యావరణ కాలుష్యం నుంచి సముద్ర తీరాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి బామిరెడ్డి అన్నారు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో గురువారం భారతీయ మత్స్య పరిశోధన సంస్థ, జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు ప్రవర్తనా నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ చేపల సుహాసిని సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా బామిరెడ్డి మాట్లాడుతూ సముద్రంలో మత్స్య వనరులు, తీరంలో కాలుష్యం గురించి వివరించారు. జాలర్లు సముద్రంలో వదిలేసే వలల వల్ల మత్స్య సంపదకు ఎంతో నష్టం కలుగుతోందని తెలిపారు. మత్స్య సంపద పునరుత్పత్తికి అనువుగా తీరంలోని సముద్ర జలాల్లో సిమెంట్ బ్లాకులు నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ ప్రయత్నం తమిళనాడులో మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. ఆ సిమెంటు బ్లాకుల్లో చేపలు పిల్లలను పెడితే సురక్షితంగా ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా సముద్రయానంలో సేఫ్టీ పరికరాలను ప్రదర్శించారు. స్టాల్స్‌ను, పోస్టర్ ప్రదర్శనను మత్స్యకారులు ఆసక్తిగా తిలకించారు. వారి అవగాహనకు ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఆకట్టుకుంది. మత్స్య శాఖ ఏడీ జాస్మిన్, జూనియర్ శాస్త్రవేత్త జి.ప్రసాద్, 140 మంది మత్స్యకారులు పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో అనకాపల్లి జోన్ అభివృద్ధి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ




జలగల మదుం జంక్షన్ వద్ద విస్తరణ పనులను పరిశీలిస్తున్న సాయికాంత్ వర్మ, జాహ్నవి

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ అనకాపల్లి జోన్ అభివృద్ధిలో భాగంగా వివిధ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులు విడుదల చేసిందని జీవీఎంసీ కమీషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. జోన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను జీసీ జాహ్నవితో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలగల మదుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకూ 60 అడుగుల రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రహదారి మధ్యలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకూ రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి వెంట ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ, జెడ్పీ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ గంగాధరరావు తదితరులు ఉన్నారు.

ఎంతమంది కలిసి వచ్చినా.. ప్రజల మద్దతు మాకే

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై కలిసొచ్చినా.. రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతు తమకేనని వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన పొత్తని పవన్ కల్యాణ్ చెప్తున్నా.. కేవలం చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. మధురవాడ ఐటీ జంక్షన్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్కిల్ స్కాంలో పక్కాగా ఆధారాలతో దొరికితే కక్షపూరితంగా అరెస్ట్ చేశారని ఎలా చెబుతారని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్ట్‌తో తెలుగుదేశంలో నాయకులు, కార్యకర్తల్లో అభద్రతా భావం కలిగే పరిస్థితి ఉంటుందనే.. ఆ పార్టీకి బలంగా ఉండాలనే పవన్‌కల్యాణ్‌తో పొత్తు ప్రకటన చేయించారన్నారు. టీడీపీ, జనసేన పొత్తు ఇప్పటిది కాదని.. 2014 నాటి నుంచి ఉందన్నారు. 2019 ఎన్నికల్లోనూ ముసుగులో ప్రేమాయణం నడిపారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో టీడీపీలో లోకేష్ నాయకత్వానికి గతి లేక.. అత్యవసరంగా పవన్ చేత పొత్తు ప్రకటన చేయించినట్లు స్పష్టంగా అనిపిస్తోందన్నారు.



పవన్ అభిమానుల ఆశలను తాకట్టు పెట్టారు

చోడవరం: సొంతంగా పోటీ చేసే సత్తా లేని జనసేన అధినేత పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తు పెట్టుకొని అభిమానుల ఆశలను తాకట్టు పెట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విమర్శించారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'టీడీపీతో పొత్తు తప్ప నీకు వేరు ప్లాట్‌ఫారమే లేదా.. కాపు కులాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేయాలనుకున్న నీవు ఆ కులాన్నే ఇప్పుడు తాకట్టు పెట్టావ'ని ధర్మశ్రీ ధ్వజమెత్తారు. గతంలో ముద్రగడ పద్మనాభాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైల్లో పెట్టిస్తే వారిని పరామర్శించడానికి వెళ్లిన మీ అన్న చిరంజీవిని అడ్డుకొన్న వ్యక్తిని ఇప్పుడు నువ్వు జైలుకెళ్లి పరామర్శించడం సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

శిబిరం చిరునామా

డాక్టర్ హిమశేఖర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
సత్తెమ్మతల్లి ఆలయం రోడ్డు, గవరపాలెం, అనకాపల్లి
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబర్లు :
90101 06665, 70757 09205

కళ్ల ముందే చెదిరిన కల

- లారీ చక్రాల కింద నలిగిన విద్యార్థిని
- బైక్‌పై పాఠశాలకు తీసుకెళ్తుండగా ప్రమాదం
- తల్లడిల్లిన ఆ చిన్నారి తండ్రి గుండె

మరో మూడు నిమిషాల్లో కుమార్తెను స్కూలులో దించి, తిరిగి తను పాఠశాలకు బయలుదేరాల్సినవాడు.. ఇంతలోనే మృత్యురూపంలో వచ్చిన లారీ చిన్నారిని చిదిమేయడంతో కుప్పకూలిపోయాడు. కళ్ల ముందే చక్రాల కింద నలిగిపోవడంతో ఆ తండ్రి గుండె తల్లడిల్లింది. ఊహించని ఈ ఘోరానికి మ్రాన్పడిపోయాడు. ఈ ఘటన గురువారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో పాయకరావుపేటలో చోటు చేసుకుంది.

పాయకరావుపేట: స్థానిక పోలీసు స్టేషన్ సమీపాన బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఘోరం జరిగింది. చక్కగా స్కూలుకు తయారైన ముద్దులొలికే పాప క్షణాల్లో ఛిద్రమైంది. విగత జీవిగా మారింది. కన్న తండ్రి కళ్ల ముందే ఈ దారుణం చోటుచేసుకుంది. ఎస్ఐ బి.జోగారావు అందించిన వివరాలు.. స్థానిక పోలీసు స్టేషన్ సమీపాన వీవర్స్ కాలనీలో ఉపాధ్యాయుడు పిన్నింటి సురేష్‌కుమార్‌నాయుడు తన కుమార్తె హరిణి (13)ని స్థానిక శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌కు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నారు. జాతీయ రహదారిపైకి వచ్చేసరికి తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న విద్యార్థిని హరిణి ఎగిరిపడి లారీ వెనుక చక్రాల కింద పడిపోయింది. ఆమె కుడి తుంటి భాగం, కుడి మోచేయి భాగం లారీ టైరు కింద పడి నలిగిపోయాయి. వెంటనే తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ప్రమాదంలో అతడికి ఎటువంటి గాయాలు కాలేదు. విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన సురేష్‌కుమార్‌నాయుడు నక్కపల్లి మండలం చినదొడ్డిగొల్లు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అదే మండలం ఉద్దండపురంలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లోనే 8వ తరగతి చదువుతున్న హరిణి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



లారీ టైరు కింద పడి మృతి చెందిన హరిణి



తుని ఏరియా ఆస్పత్రి వద్ద విషాదంలో హరిణి కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) హరిణి (ఫైల్)

మృతదేహానికి తుని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ జోగారావు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గొంపలో గ్యాస్ లీక్

- ఇంట్లోని గృహోపకరణాలన్నీ దగ్ధం
- తప్పిన ప్రాణాపాయం




గ్యాస్ లీక్‌తో దగ్ధమవుతున్న ఇంట్లోని గృహోపకరణాలు

రావికమతం: మండలంలోని గొంప గ్రామానికి చెందిన సీరందాసు ఆనంద్ ఇంట్లో గురువారం సాయంత్రం వంట గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఇంట్లోని గృహోపకరణాలన్నీ కాలిపోయి తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో వంట చేస్తున్న ఇల్లాలితోపాటు ఆమె భర్త, ఇద్దరు పిల్లలు బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. సీరందాసు భార్య స్వాతి సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో వంట చేస్తుండగా సిలిండర్ వద్ద గ్యాస్ లీకైంది. దీంతో అప్రమత్తమైన ఆమె రెగ్యులేటర్ కట్టి వేసింది. అయినా గ్యాస్ లీకు ఆగలేదు. మరింత ఎక్కువ కావడంతో ఆమె భయంతో గట్టిగా కేకలేస్తూ అప్రమత్తం చేసింది. దాంతో తన భర్త ఆనంద్, ఇద్దరు చిన్నారులను తీసుకుని బయటకు పరుగులు తీసింది. వారు బయటకు వచ్చేసిన కొద్ది సేపటికే ఇల్లంతా మంటలు వ్యాపించాయి. ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, ధాన్యం, బియ్యం, ఇతర గృహోపకరణాలన్నీ కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక శకటానికి ఫోన్ చేసినప్పటికీ వారు సకాలంలో రాకపోవడంతో స్థానికులు పల్లా పెదనాయుడు, పసుపులేటి శ్రీను, యువకులు మంటలను అదుపు చేశారు. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

భార్య మృతి కేసులో భర్త అరెస్టు

మాకవరపాలెం: భార్య మృతికి కారణమైన భర్తను అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు గురువారం తెలిపారు. మండలంలోని చామంతిపురం గ్రామానికి చెందిన షేక్ రాజాసాహెబ్(23)తో ఇదే గ్రామానికి చెందిన సైదాబి(21)కి మూడేళ్ల క్రితం వివాహమైందని, వీరికి బాబు ఉన్నాడన్నారు. ఇటీవల రాజాసాహెబ్ తన భార్యపై అనుమానంతో వేధిస్తుండేవాడని, వాటిని భరించలేని ఆమె స్థానిక బావిలో దూకి మంగళవారం ఆత్మహత్య చేసుకుందన్నారు. దీనిపై మృతురాలి తండ్రి బాబూరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టి అరెస్టు చేశామని తెలిపారు.

ఆకట్టుకున్న 'ఓం'కారం



'ఓం' ఆకృతిలో ప్రదర్శన చేస్తున్న డాక్టర్ హిమశేఖర్ స్కూల్ విద్యార్థులు

తుమ్మపాల: పట్టణంలో డాక్టర్ హిమశేఖర్ స్కూల్‌లో హిందీ దివస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. హిందీ భాష ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ కె.జనార్దన్, ప్రిన్సిపాల్ సురేష్ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హిందీ భాష గొప్పతనం చాటుతూ విద్యార్థులు 'ఓం' ఆకృతిలో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపికృష్ణ, జగన్, ఆదిలక్ష్మి, మాలతీరాణి, జ్యోత్స్న, తేజ, జయశ్రీ. గోవర్ధిని పాల్గొన్నారు.

కారుణ్య నియామకం కింద ఇద్దరికి పోస్టింగ్‌లు



ఏఎస్ఐ కుమారుడికి కారుణ్య నియామకపత్రం అందిస్తున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సీలేరు, మంప పీఎస్‌ల పరిధిలో పని చేస్తూ అనారోగ్యం కారణంగా మృతి చెందిన ఏఎస్ఐల కుమారులకు ఆయన గురువారం అల్లూరి, అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయాల్లో టైపిస్టులుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో సీలేరు పీఎస్‌లో ఏఎస్ఐగా పని చేస్తూ పి.జగత్‌రాయ్, మంప పీఎస్‌లో ఏఎస్ఐగా ఎల్.నూకరాజు పని చేస్తూ గత ఏడాది మార్చిలో అనారోగ్యంతో మృతి చెందారని, రాయ్ కుమారుడు పి.పరశురాంకు అల్లూరి జిల్లా, నూకరాజు కుమారుడు సతీష్‌కు అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయాల్లో టైపిస్టులుగా నియామకపత్రాలు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, పరిపాలన అధికారి బి.శారద, సూపరింటెండెంట్ విజయకుమార్, సీనియర్ అసిస్టెంట్ బాలుమహేంద్ర పాల్గొన్నారు.

రూ.45 లక్షల ఎంపీ నిధులతో

పలు అభివృద్ధి పనులు

- ఎంపీ బీవీ సత్యవతి



శాంతిపార్కు అభివృద్ధికి మంజూరైన నిధుల పత్రాన్ని అందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ 82వ వార్డు పరిధిలో ఎంపీ నిధుల నుంచి రూ.45 లక్షలు మంజూరు చేసి, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా ప్రాంతాల ప్రజలు కొన్ని అభివృద్ధి పనులపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు, తనకు విన్నవించారన్నారు. ఈ మేరకు స్థానిక శారదానది శాంతిపార్కు అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించామన్నారు. గాంధీనగరంలో బీసీ విద్యార్థుల వసతి గృహానికి రూ.15 లక్షలు, ఎస్సీ విద్యార్థుల వసతి గృహానికి రూ.20 లక్షలు మంజూరు చేశామని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో గ్యాలరీల ఖాళీ స్థలంలో బాలికలకు డార్మెటరీ నిర్మాణ పనులు రూ.70 లక్షలతో జరుగుతున్నాయన్నారు. రెండు మాసాల్లో పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోనికి తీసుకొస్తామన్నారు. ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని సీఎస్ఆర్, ఎంపీ, జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది సీఎస్ఆర్ నిధులతో రూ.30-40 లక్షలతో క్రీడా మైదానం గ్రౌండ్‌ఫ్లోర్ పూర్తి అభివృద్ధి చేస్తున్నామన్నారు. నది ఒడ్డున అన్నమయ్య పార్కును అభివృద్ధి చేయాలంటే ఈ స్థలం జీవీఎంసీకి చెందినది కాదన్నారు. కొత్తూరు పంచాయతీకి చెందినదని, అయినప్పటికీ ప్రశాంతమైన వాతావరణంలో ఉండే విధంగా వివిధ రకాల పూల మొక్కలు, సిమెంట్ బెంచీలు, ఏర్పాటు చేస్తున్నామన్నారు. సర్వికాంబ పార్కు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ పట్టణంలో రూ.13 కోట్లతో అభివృద్ధి పనులను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారని, కొన్ని ప్రాంతాల్లో పనులు చేస్తున్నామని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ఐదు కార్పొరేటర్లకు కేటాయించిన ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అనంతరం శాంతిపార్కు అభివృద్ధికి విడుదల చేసిన రూ.10 లక్షల పత్రాన్ని జానకిరామరాజుకు ఎంపీ అందజేశారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ప్రదర్శన తిలకిస్తున్న బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

కశింకోట : పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వంశీప్రియ అన్నారు. ఏనుగుతుని గ్రామంలో ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవంలో భాగంగా పౌష్టికాహారం తయారీపై గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు ప్రతి రోజూ కోడిగుడ్డు, పాలు, బాలామృతం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లోని ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. దీనివల్ల ఆరోగ్యం పొంది శిశు మరణాలు, మాతృ మరణాలు లేని ఆదర్శ గ్రామంగా తయారు కాగలదన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషకాహార పదార్థాలతో అందంగా అలంకరించి ప్రదర్శించారు. పోషకాహారాలు రుచి చూపించి వాటిని ఇంట్లో కూడా వండుకొని ఆహారంగా క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలు ఏ విధంగా ఆహారంగా తీసుకోవాలనే విషయమై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పాక నాగమణి, ఉప సర్పంచ్ కె.రామగణేష్, హెచ్‌ఎం యు.అప్పలనాయుడు, మహిళా పోలీస్ వి. ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు కె.జగదీశ్వరి, ఆర్. కిరణ్‌కుమారి, వి. జ్యోతి, సత్యవతి, సోనియా, అమ్మాజీ పాల్గొన్నారు.

కుమ్మరి శాలివాహన సంఘానికి అండగా సీఎం జగన్

- సంఘ రాష్ట్ర చైర్మన్ పురుషోత్తమ్



మొల్లబాంబను దర్శించుకుంటున్న కుమ్మరి శాలివాహన సంఘ రాష్ట్ర చైర్మన్ పురుషోత్తమ్

మాడుగుల: కుమ్మరి శాలివాహన సంఘాన్ని గుర్తించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, కుమ్మరి శాలివాహన సంఘ రాష్ట్ర చైర్మన్ మండేపూడి పురుషోత్తమ్ అన్నారు. గురువారం సాయంకాలం మండలంలో సత్యవరం గ్రామంలో వెలసిన కవయిత్రి మొల్లమాంబను దర్శించుకున్నారు. అనంతరం మండల సంఘ అధ్యక్షుడు వొమ్మలి రమణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘ సభ్యుల సమావేశంలో మాట్లాడారు రానున్న కాలంలో మొల్ల జయంతి వేడుకలు ప్రభుత్వమే నిర్వహించాలని, కుండలు తయారీలో 50 ఏళ్లకే వృద్ధాప్యం వస్తున్న కారణంగా కుటుంబ యజమానికి పింఛను 50 ఏళ్లకే అందజేయాలని, రజకులను, నాయీబ్రాహ్మణను ఆదుకునే విధంగా కుమ్మరుల వృత్తిలో ఉన్నవారిని ఆదుకోవాలని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, దీనికి సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. కుండల తయారీకి పంట చెరువుల్లో మట్టి తీసుకోవడానికి కూడా ప్రభుత్వ అనుమతులు తీసుకు రావడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర చైర్మన్ హోదాలో తొలిసారిగా మండలానికి వచ్చిన పురుషోత్తమ్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర డైరెక్టర్ అర్జునరావు, మండల సంఘ సభ్యులు వొమ్మలి పెంటయ్య, వాలేటి దేముడు, కరకపాటి నూకరాజు, వొమ్మలి అచ్చుతరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ప్రారంభం



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న రావికమతంఎంపీపీ పైల రాజు,



వాలీబాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

రావికమతం: స్కూల్ గేమ్స్ గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలుర విభాగాల్లో మండలంలోని పలు హైస్కూళ్ల నుంచి వచ్చిన వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎంపీపీ పైల రాజు, స్కూల్ కమిటీ చైర్మన్ ప్రసాద్, పీడీ లక్ష్మణరావు ప్రారంభించారు. త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు టి.అర్జాపురం హైస్కూల్‌లోనూ, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్, షటిల్‌బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ రావికమతం హైస్కూల్‌లోనూ నిర్వహించారు. వీటిల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున విద్యార్థులు రావడంతో విజేతల ఎంపిక ఆలస్యమయ్యే అవకాశం ఉందని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పైల లక్ష్మణరావు తెలిపారు.

రోలుగుంటలో..

రోలుగుంట: మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, ఎంఈవో జాను ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో మండలంలోని కేజీబీవీతోపాటు తొమ్మిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

మాకవరపాలెం: చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల స్థాయిలోనే కాకుండా డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు హరిబాబు, నాయకులు పెట్ల భద్రాచలం, బొడ్డేటి వెంకటరమణ, వెలగా రమణ, ఎంఈవోలు మూర్తి, లక్ష్మి, హెచ్‌ఎం అచ్యుతరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యన్న కాలనీలో చోరీ

నర్సీపట్నం: మున్సిపాలిటీ అయ్యన్నకాలనీలో జి.హరీష్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. టౌన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం హరీష్ తన కుటుంబ సభ్యులతో కలిసి తుని వెళ్లాడు. బుధవారం వచ్చేసరికి ఇంటి తాళాలు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రూ.6 వేలు, రూ.9 వేలు విలువ చేసే వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు అతడు గుర్తించాడు. బాధితుడు ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

- సోషల్ ఆడిట్‌లో వెలుగులోకి
- రూ.2.37 లక్షలు రికవరీకి అధికారుల ఆదేశాలు



ఉపాధి పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్న అడిషనల్ పీడీ రోజారాణి, అధికారులు

నర్సీపట్నం : మండల పరిషత్‌లో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఉపాధి పథకంలో అవకతవకలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. ఎన్ఆర్ఈజీఎస్ అడిషనల్ పీడీ రోజారాణి, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, ఎంపీడీవో జయమాధవి గురువారం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించారు. రూ.2.37 లక్షల రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వివరాలిలావున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపట్టిన 617 పనులకు రూ.9,15,99,046లకు సంబంధించి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ 594 పనులకు రూ.8,26,80,686, పంచాయతీరాజ్‌శాఖలో 19 పనులకు రూ.77,51,086, ఆర్‌డబ్ల్యూఎస్‌లో 2 పనులకు రూ.11,66,792, సర్వశిక్ష అభియాన్‌శాఖ పనులు చేసినట్టు అధికారులు వెల్లడించారు. పంచాయతీరాజ్‌శాఖలో రూ.2.12 లక్షలు ఏ పనులకు ఖర్చు పెట్టారో వివరాలు లేకపోవడంతో అధికారులు రికవరీకి ఆదేశాలు జారీ చేశారు.

అండర్ - 19 ఉమ్మడి విశాఖ జిల్లా జట్ల ఎంపిక



అండర్ -19 బాలికల కబడ్డీ జిల్లా జట్టు



బాలికల వాలీబాల్ జట్టు



అండర్ -19 బాలుర వాలీబాల్ జిల్లా జట్టు



బాలుర కబడ్డీ జిల్లా జట్టు

చోడవరం రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో పలు క్రీడా పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధ, గురువారాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. మొదటి రోజున కబడ్డీ పోటీలకు 180 మంది, టెన్నికాయిట్ పోటీలకు 50 మంది, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు 52 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రెండో రోజు వాలీబాల్ పోటీలకు అత్యధికంగా 290 మంది, త్రోబాల్ పోటీలకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిని జట్లుగా విభజించి ఆయా పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ప్రాథమికంగా ఎంపిక చేశారు. రెండు రోజుల క్రీడాంశాలలో పాల్గొనడానికి వచ్చిన 632 మంది విద్యార్థినులు, విద్యార్థులతో క్రీడా మైదానంలో సందడి నెలకొంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గోలిరెడ్డి రాంబాబు నేతృత్వంలో జిల్లా జట్ల ఎంపిక పోటీలను సాఫీగా నిర్వహించడంలో పలు పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు తమ వంతు కృషి చేశారు.

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్: జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్‌ను సరఫరాను నిలిపివే యనున్నట్లు విద్యుత్‌శాఖ అనకాపల్లి డివిజన్ ఈఈ(ఆపరేషన్) కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటలో తెలిపారు. పేర్కొన్నారు. పట్టణంలో నెహ్రూచౌక్ నుంచి పూడిమడక జాతీయ రహదారి వరకూ విద్యుత్ సరఫరాలో అంత రాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించా ల్సిందిగా కోరారు.

తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర మరింత అందుబాటులోకి వచ్చిం ది. కిలో రూ.200 వరకు పెరిగిన ధర క్రమేపీ తగ్గుతూ ఈ వారం రూ.20కి చేరింది. దీంతో ప్రజలు కాస్త ఎక్కువ మొత్తంలో కొనుగోళ్లు జరిపారు. అయితే ఎ గ్రేడ్ టమాటా మాత్రం కిలో రూ.25 పలికింది. దొండకాయ కూడా కిలో రూ.30 నుంచి రూ.20కి తగ్గింది. బంగాళాదుం ప ఇదే ధరకు విక్రయించారు. ఎప్పటిలాగే ఉల్లి పాయ రూ.30, బెండకాయ, చేమదుంప, వం కాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.80, అగాకర రూ.50కి విక్రయాలు సాగాయి.

రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు

కశింకోట: కశింకోటలోని పలు వీధుల్లో రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజి నిర్మించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధి కార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు గురువారం తెలిపారు. సలాది వీధి, కోమటి వీధి, గొల్ల పేట, వడ్డి వీధి ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తామ న్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మం త్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులతో సత్వరమే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉప్పునీటి దిబ్బ ప్రాంతంలో రూ.6 లక్షలతో సామాజిక భవనం నిర్మించడానికి భూమి పూజ చేశారు.

నేడు చిన హైస్కూల్లో ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

అనకాపల్లిటౌన్: గవరపాలెం జీవీఎంసీ చినహై స్కూల్లో స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వ ర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారం భించనున్నట్లు ఫెడరేషన్ మండల సమన్వయ కర్త ఎస్వీ నరసింహం గురువారం ఓ ప్రక టనలో తెలిపారు. శుక్రవారం ఖోఖో, టెన్నీ కాయిట్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఉదయం 9 నుంచి ప్రారంభమవుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యా యులు ముందుగా తమ పేర్లను నమోదు చేసు కోవాలని సూచించారు. ఈ క్రీడాపోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఛాంగురే బంగారురాజా	:	రాజా
మార్క్ ఆంటోని	:	సత్యనారాయణస్క్రీన్-1
ది సన్	:	సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	:	షిర్డిసాయి
జవాన్	:	షిర్డిసాయి
జవాన్	:	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:	శ్రీసత్య
ఖుషి	:	రామచంద్ర

చేపల చెరువులతో.. ఉపాధి.. ఆదాయం

- కశింకోట మండలంలో ఆరు చేపల చెరువుల అభివృద్ధి
- పంచాయతీలకు అదనపు ఆదాయం, కూలీలకు ఉపాధి

కూలీలకు వ్యవసాయ పనుల్లేని సమయంలో పని కల్పించాలి. అది కూడా గ్రామాలకు స్థిరాదాయం అందించే ఆస్తుల్ని అభివృద్ధి చేసేలా ఉండాలి. అదే ఉపాధి హామీ పథకం ప్రధాన లక్ష్యం. కశింకోట మండలంలో ఈ ఏడాది ఉపాధి పనుల్లో ఆరు చేపల చెరువుల్ని అభివృద్ధి చేశారు. దీంతో కూలీలకు ఉపాధి, పంచాయతీలకు అదనపు ఆదాయ వనరు సమకూర్చినట్టయింది.



తీడలో ఉపాధి పథకంలో తవ్విన చేపల చెరువు



చెరకాంలో తులసీ జలాశయంలో చేపల చెరువు తవ్వుతున్న కూలీలు

కశింకోట: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది ఎక్కువగా చేపల చెరువుల తవ్వకంపై దృష్టి పెట్టారు. ఆరు చేపల చెరువు లు(ఫిష్ పాండ్స్) తవ్వకం చేపట్టి తాజాగా పూర్తి చేశారు. సుమారు రూ.45 లక్షలు వ్యయం చేశారు. వీటి ద్వారా పంచాయితీలకు అదనపు ఆదాయం సమకూరనుంది. సుమారు 1200 మంది కూలీలకు ఉపాధి కలిగింది.

ఉపాధి, ఆస్తుల అభివృద్ధి

స్థిరమైన ఆస్తుల అభివృద్ధి ఉపాధి పథకం ప్రధాన ఉద్దేశ్యం. ఈ పథకం కింద పంట కాలువలు, రోడ్లు అభివృద్ధి, సాగు నీటి చెరువులు, గెడ్డల్లో పూడికలు తొలగింపు, గట్ల పటిష్టం, అభివృద్ధి, వాటిపై ఫల సాయాన్నిచ్చే మొక్కలు పెంచడం, పంచాయ తీలకు ఆదాయాన్నిచ్చే చేపల చెరువుల తవ్వకం, వర్షపు నీటిని నిల్వ చేయడానికి కందకాల ఏర్పాటు, మదుంల నిర్మాణం తదితర అనేక పనుల్ని నిర్వహి స్తున్నారు. తద్వారా కూలీలకు ఉపాధి కల్పిస్తు న్నారు. ఇందులో భాగంగానే మండలంలో ఈ ఏడాది చేపల చెరువుల తవ్వకంపై ప్రధానంగా దృ ష్టి సారించారు. వీటి ద్వారా పంచాయతీలకు అద నపు ఆదాయ వనరులు సమకూర్చినట్టయింది. ప్రస్తుతం ఉన్న చెరువుల్లోనే చేపల చెరువుల తవ్వ కాన్ని చేపట్టారు. ఐదు గ్రామాల్లోని చెరువులు, జలాశయాల్లో ఈ ఏడాది ఐదు చేపల చెరువులను, గత ఏడాది ప్రారంభించిన మరో దాన్ని ఈ ఏడాది పూర్తి చేశారు.

1,200 మంది కూలీలు.. 100 పని దినాలు

చేపల చెరువుల అభివృద్ధి ద్వారా ఈ ఏడాది 1,200 మంది కూలీలకు, 100 రోజులు చొప్పున ఉపాధి పని దినాలు కల్పించారు. దీనిలో భాగంగా బయ్య వరంలోని పెద్ద చెరువు, తుమ్మల చెరువు, అడ్డాం, తీడ గ్రామాల్లోని సాగునీటి చెరువుల్లో చెరొకటి, చెర కాంలోని తులసీ జలాశయం, జమాదులపాలెం వద్ద రంగబోలు గెడ్డ జలాశయాల్లో చేపల చెరువల్ని అభివృద్ధి చేశారు. ఒక్కో చెరువుకు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు వ్యయం చేశారు. చెరు వులు, జలాశయాల్లో అనువైన మూల ప్రాంతాన్ని ఎంపిక చేసి, చేపల చెరువుల్ని తవ్వారు. వీటిని చేపల పెంపకానికి అనువుగా నాలుగు భాగాలుగా ఏర్పాటు చేశారు. ఈ పనులు ఇటీవల పూర్తి అయ్యాయి. ఫిషరీస్ విభాగం ద్వారా వీటిలో చేపల పెంపకం చేపట్టనున్నారు. అనంతరం వాటిని ఆయా పంచాయతీలకు అప్పగించనున్నారు. తద్వారా పంచాయితీలకు అదనపు ఆదాయం సమ కూరనుంది.

పంచాయతీలకు ఏటా ఆదాయం

ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆరు చేపల చెరువుల తవ్వకాలను ఇటీవల పూర్తి చేశాం. వీటికి ఒక్కో దానికి రూ.7 నుంచి రూ.8 లక్షల వంతున రూ.45 లక్షల వరకు వ్యయం అయిం ది. వీటిలో పూర్తిగా నీరు చేరాక మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను సమకూర్చి, వాటి పెంపకం చేపడతాం. అనంతరం పంచాయతీకి బాధ్యతలు అప్పగిస్తాం. చేపల పెంపకం ద్వారా ఏటా అదనపు ఆదాయం పం చాయతీలకు సమకూరనుంది. చేపల చెరువుల తవ్వకంతో సుమారు 1200 మంది కూలీలకు ఉపాధి కలిగింది.

-కె.శివ, ఏపీవో, ఉపాధి హామీ పథకం, కశింకోట

సమస్యల పరిష్కారానికి ఎంపీకి వినతులు



పట్టణ పరిధిలో అనాథాశ్రమం ఏర్పాటుకు ఎంపీకి వినతి పత్రం అందిస్తున్న నాగభూషణం

అనకాపల్లిటౌన్: జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లి పట్టణంలో నిరాశ్రయులు, అనాథలు, అభాగ్యు లకు ప్రభుత్వం ఆదరణ ఆశ్రమం(ఆర్ఫన్స్ హోమ్)ను నిర్మించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అం డ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీ బీవీ సత్యవతిని గురువారం కలిసి వినతిపత్రం అందించారు. పట్టణ పరిధిలో రహదారులపై జీవితాలను వెళ్లదీస్తున్న అనాథలను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో అసోసియేషన్ ఉపాధ్య క్షుడు వినకోట నీలేశ్‌గుప్తా, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్, పిర ట్ల నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

తాగునీరు, సీసీ రోడ్లకు వినతి

గవరపాలెం సాయి బృందావన్ కాలనీ వాసులు ఎంపీ సత్యవతిని కలిసి, స్థానిక సమస్యలపై మొర పెట్టుకున్నారు. పట్టణంలో తమ కాలనీ కొత్తగా ఏర్పడిందని, ఈ కాలనీలో నివసించే ప్రజలకు తాగునీరు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు కాలనీ వాసి, విశ్రాంత ప్రిన్సిపాల్ శర గడం నూకరాజు ఎంపీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలు నిర్మించుకునేందుకు జీవీఎంసీ అధికారులు అనుమ తులిచ్చారని, కాలనీలో కనీస మౌలిక సదుపా యాలు కల్పించాలని విన్నవించారు.

సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ పింఛన్లు



కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్లు అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



నూతన పింఛన్లు అందిస్తున్న ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్: బడుగు, బలహీన వర్గాల ప్రజలు మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలంటే మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించు కోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు కోరారు. మండ లంలోని మామిడిపాలెం గ్రామంలో 27 మందికి కొత్తగా మంజూరైన పెన్షన్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ కావాలంటే టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారని, ప్రస్తుత సీఎం జగన్ పాలనలో అర్హులైన వారందరికీ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతీ నెల 1వ తేదీ తెల్లవారుజామునే పిం ఛన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎ స్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సేనాపతి హరి కృష్ణ, ఎంపీటీసీ బంధం అప్పలనాయుడు, మండల కో ఆప్షన్ సభ్యుడు బొండా అప్పల రాజు, గ్రామ కార్యదర్శి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: అర్హులు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు అందిస్తుందని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతు లూరి దిలీప్‌కుమార్ అన్నారు. గురువారం తుమ్మపా ల గ్రామ పంచాయతీలో కొత్త ఫించన్‌లు మంజూరైన 104 మంది లబ్ధిదారులకు ఆయన నగదు అందించా రు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ని సత్కరించా రు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ చదరం చిన్నా, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కూండ్రంలో 48 మందికి కొత్త పింఛన్లు

మండలంలోని కూండ్రం గ్రామ సచివాలయం పరి ధిలో 48 మందికి కొత్త పింఛన్లను ఎంపీపీ గొర్లి సూరిబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల కంటే ప్రస్తుత ప్రభుత్వంలో ఎక్కువ మంది లబ్ధిదారు లకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారుర. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సేనాపతి పెంటా రావు, మండల కో ఆప్షన్ సభ్యుడు బొండా అప్పల రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం, పోటీతత్వం



విద్యార్థినితో పోటీలను ప్రారంభిస్తున్న జానకీరామరాజు



పోటీలను తిలకిస్తున్న క్రీడాకారులు

అనకాపల్లిటౌన్: క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యా నికి ఎంతగానో దోహదపడటంతోపాటు, విద్యా ర్థుల్లో పోటీ తత్వాన్ని పెంచుతాయని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక జీవీఎంసీ పెదహైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అండ ర్-14, 17 బాల బాలికల క్రీడాపోటీలను గురు వారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ స్థాయి నుంచి క్రీడలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిస్తే ప్రభుత్వ ఉద్యోగాలను పొందవచ్చన్నారు. ప్రభుత్వం జగనన్న క్రీడా క్లబ్‌ల ద్వారా క్రీడలకు ఎం తగానో ప్రాధాన్యతనిస్తోందన్నారు. విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా తీసుకుని, మరోసారి విజయానికి ప్రయత్నించాలన్నారు. ఈ నెల 16 వరకు నిర్వహించనున్న మండల స్థాయి పోటీల విజేతలను నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

తొలిరోజు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ పోటీ లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం ఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు, ఫెడరేషన్ మం డల కన్వీనర్ ఎస్వీ నరసింహం, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం సత్తిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వినాయక మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను ఆవిష్కరిస్తున్న కొణతాల మురళీకృష్ణ, బండారు ప్రసాద్‌లు

అనకాపల్లిటౌన్: పర్యావ రణాన్ని కాపాడుకోవా ల్సిన బాధ్యత ప్రతి ఒక్క రిపై ఉందని నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణ తాల మురళీకృష్ణ అన్నా రు. గవరపాలెం అమ్మ వారి ఆలయంలో సామూ హిక వినాయక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్‌లు ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి గణపతులను పూజించి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని కోరారు. నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీలు

కశింకోట: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, డీపీఎస్ జెడ్పీ హైస్కూ ళ్లలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు శుక్ర వారం నుంచి 3 రోజులపాటు నిర్వహించనున్నట్లు హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకు మారి, పీడీలు పెంటకోట కమల, వి.ప్రభాకరరావులు గురువారం తెలిపారు. మండలంలోని 12 స్కూళ్ల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నీకాయిట్, షటిల్, బాల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలి పారు. మొదటి రోజు బాలురకు, 16న బాలికలకు 14 ఏళ్లు, 17 ఏళ్లలోపు విభా గాల్లో ఆటల పోటీలు జరుగుతాయన్నారు. 19న అథ్లెటిక్స్‌లో భాగంగా పరుగు, త్రో బాల్, జంపింగ్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థు ల్ని ఆయా ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సిందిగా కోరారు.

ఉత్తమ గురువులకు సత్కారం



వెదురుపర్తి హైస్కూల్లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు సన్మానం

కశింకోట: తమ పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు ఒకేసారి రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు రావడం ఎంతో ఆనందకరమని వెదురుపర్తి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జీవీకే ఆచారి అన్నారు. హైస్కూ ల్‌కు చెందిన ఇంగ్లిష్ ఉపాధ్యాయులు సవిత లక్ష్మి రాష్ట్ర స్థాయి, బోయిన చిన్నా రావు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉపాధ్యాయ దినోత్సవాన పుర స్కారాలు పొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరిని గురువారం స్థానిక హైస్కూల్, రెండు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు కలిసి పూలదండలు వేసి, దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పురస్కారం అనేది ఉపా ధ్యాయుని బాధ్యతను మరింత పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సూర్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విజేతలైన క్రీడాకారులను ట్రోఫీతో అభినందిస్తున్న రత్నాకర్

అనకాపల్లిటౌన్: విద్యతోపాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని వైఎస్సా ర్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో 3 బంగారు, 7 వెండి, 2 కాంస్య పతకాలను సాధించిన పట్టణానికి చెందిన ఆరు గురు క్రీడాకారుల్ని గురువారంయ ఆయన స్థానిక కరాటే అకాడమీ అభినం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయి పోటీల్లో వారంతా రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు క్రీడల్లో ఆసక్తి పెంచేం దుకు క్రీడా పోటీలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. విద్యార్థు లంతా ఈ పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో అకాడమీ మాస్టర్ ట్రైనర్ ఎంపీఎండీ నాయుడు, కోచ్ ఈశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ భాష ప్రాధాన్యతపై విద్యార్థుల ప్రదర్శన, చిత్రంలో ఉపాధ్యాయులు

కశింకోట: జాతీయ భాష హిందీ అభ్యసన పట్ల విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో మూర్తి సూచించారు. స్థానిక బాలికల హైస్కూల్లో గురు వారం హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష ప్రాముఖ్యతపై విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిం చారు. హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, హిందీ ఉపాధ్యాయురాలు రేవతి, పీడీ పి.కమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కాండ్రేగుల శ్రీరామ్

అనకాపల్లిటౌన్: స్థానిక నర్సింగరావుపేట దుర్గా లాడ్జి వీధిలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం ప్రముఖ వ్యాపారవేత్త కాండ్రేగుల శ్రీరామ్ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలకంటే అన్నదానం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణ ఆలయ కమిటీ సభ్యులు కోన రామకృష్ణ, ప్రసాదుల లక్ష్మణ్, సూర్య, సాయికుమార్, సంతోష్, హేమంత్ తది తరులు పాల్గొన్నారు.

అభాగ్యుల జీవితాలకు భరోసా పింఛన్

అనకాపల్లిటౌన్: అభాగ్యుల జీవితాల్లో జగనన్న పింఛన్ కానుక ధైర్యాన్ని ఇస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అన్నారు. స్థానిక ఐదో సచివాలయంలో ఆయన కొత్తగా మంజూరైన 92 మం దికి గురువారం పింఛన్ల నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా, అర్హులందరికీ పిం ఛన్లు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమం వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు పాల్గొన్నారు.